

పల్లెటూరు.. అమ్మతీరు
పట్నం నుంచి వచ్చిన చిన్నారులు పల్లెల్లో వేసవి సెలవులను ఆస్వాదిస్తున్నారు. చెరువులు, కాలువ గట్లు, పంట పొలాల వద్ద ఆటపాటలు సాగిస్తున్నారు. 8లో▸



జోరందుకున్న వరికోతలు
అకాల వర్షాలతో జిల్లాలో వరి కోతలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. రైతులంతా ఒకేసారి కోతలు ప్రారంభించగా హార్వెస్టర్లకు డిమాండ్ పెరిగింది. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
42.8/29.8
వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశంలో అక్కడక్కడా మబ్బులు ఉంటాయి. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. మధ్యాహ్నం ఎండ, రాత్రి ఉక్కపోత అధికంగా ఉంటాయి.

న్యూస్‌రీల్

అడెల్లి పోచమ్మకు పూజలు



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

సారంగాపూర్: అడెల్లి మహాపోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, హైదరాబాద్, మహారాష్ట్ర నుంచి అధికసంఖ్యలో భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు చందు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ముగిసిన జేపీఎస్‌ల సమ్మె

నిర్మల్ ఖిల్లా: రెగ్యులరైజ్ కోసం 16 రోజులుగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మె తాత్కాలికంగా విరమిస్తున్నట్లు తెలంగాణ జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో చర్చలు జరపగా స్పష్టమైన హామీ ఇవ్వడంతో విరమించామని తెలిపారు. తమ డిమాండ్లు పరిష్కరించనట్లయితే మళ్లీ సమ్మె చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో 326 మంది జేపీఎస్‌లుండగా శుక్ర, శనివారాల్లో 28మంది, మిగతావారు ఆదివారం సాయంత్రం విధుల్లో చేరినట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత తెలిపారు.



ఎంపీడీవోకు లేఖ ఇస్తున్న జేపీఎస్‌లు

భైంసా రూరల్: భైంసా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కొనసాగుతున్న జేపీఎస్‌ల సమ్మె ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు సమ్మె విరమిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డికి విధుల్లో చేరుతున్నట్లు జేపీఎస్‌లు లేఖ అందజేశారు.

రోడ్డుకు మరమ్మతు



రోడ్డు మరమ్మతు చేయిస్తున్న గంగాధర్

లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీ–ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ రహదారిపై గతంలో పైపులు వేసి కల్వర్టు నిర్మించారు. వాహనాల తాకిడికి పైపు పూర్తిగా పగిలి పెద్ద గుంత ఏర్పడింది. ఇటుగా వెళ్లాలంటే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గమనించిన రాయపూర్‌కాండ్లీ గ్రామానికి చెందిన నాలం గంగాధర్ రూ.10వేల సొంతంగా వెచ్చించి కల్వర్టు పైపును జేసీబీ సాయంతో తీయించారు. వేరే పైపును బిగించి మొరం పోయించారు. రోడ్డుకు మరమ్మతు చేయించారు. అలాగే రాయపూర్‌కాండ్లీ నుంచి అర్లి గొడిసెరాకు వెళ్లే మార్గంలో పెద్ద గుంతలు ఏర్పడగా మొరం పోయించి గుంతలు పూడ్చివేశారు.



ఈ చిత్రంలో చెత్తతో కప్పబడిపోతోంది ఓ చారిత్రక బావి. జిల్లా కేంద్రంలో మున్సిపల్–అర్బన్ తహసీల్ కార్యాలయాల మధ్య గల శరద్‌మహల్ (శీతలమందిరం). ఇది ఓ అద్భుత కట్టడం. ఈ శరద్‌మహల్ ఎప్పుడూ చల్లగా ఉండేలా ప్రత్యేక నిర్మాణాలు చేపట్టారు. వీటికి నీటిని అందించేదే ఈ బావి. దీన్ని ఏనుగుల బావిగానూ పిలుస్తుంటారు. ఇలాంటి చారిత్రక బావిని నిర్మల్ మున్సిపాలిటీ నిర్లక్ష్యంగా డంప్‌యార్డులో వేయాల్సిన చెత్తతో నింపేస్తోంది. పలుసార్లు 'సాక్షి' కథనాలు ప్రచురించినా.. సగానికి పైగా మూసేసింది. మరికొన్ని రోజుల్లోనే ఈ బావి సజీవ సమాధి కానుంది.

కేటీఆర్‌గారు.. ఇదేం తీరు..



తెలంగాణ రాష్ట్రం ఘనమైన చరిత్ర, వారసత్వ సంపదకు నెలవు. నాటి ఇంజినీరింగ్ నైపుణ్యాన్ని కళ్లకు కట్టించే ఎన్నో కట్టడాలు, పురాతన బావులు, నిర్మాణాలను ప్రభుత్వం కాపాడే ప్రయత్నం చేస్తోంది. మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ ప్రత్యేకశ్రద్ధ తీసుకోవడంతో రాష్ట్రంలో ఇటీవల ఎన్నో పురాతన మెట్ల, కోటల బావులు వెలుగులోకి వచ్చాయి. చీకట్లను తొలగించుకుని తళుకులీనుతున్నాయి. కానీ.. చారిత్రక నేపథ్యమున్న నిర్మల్‌లో మాత్రం సీన్ ఉల్టా కనిపిస్తోంది. ఇక్కడి మున్సిపల్ తీరు ఆ శాఖ మంత్రికి విరుద్ధంగా పనిచేస్తోంది. కాపాడాల్సిన వాళ్లే.. మట్టిలో కలిపేస్తున్నారు. దీనిపై సోషల్ మీడియాలోనూ ఇటీవల 'కేటీఆర్ గారూ.. మా నిర్మల్‌తీరు చూడరూ..' అంటూ పలువురు పోస్టులు పెడుతున్నారు.

చరిత్రకు సమాధి..!



శరద్‌మహల్ వద్ద చెత్త, మట్టితో మూసేస్తున్న పురాతన బావి

- కాపాడలేం.. కప్పేస్తాం..!
- రాష్ట్రమంతటా వెలుగులోకి..
- జిల్లాలో మాత్రం మట్టిలోకి..
- చారిత్రక ఆనవాళ్లు చెరిపివేత
- కాపాడాలంటున్న జిల్లా ప్రజలు

నిర్మల్: నిర్మలంటే నిన్నమొన్నటిది కాదు. నాలుగు వందల యాభైఏళ్లకు పైగా చరిత్ర కలిగిన నేల. ఇక్కడి మట్టిలో నాటి రాజవైభోగం నేటికీ కట్టడాల రూపంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తుంటుంది. వాటి విలువ తెలియదా..!? లేక తెలిసినా పాతగోడలు, పురాతన కందకాలు, పాడుబడ్డ బావులు ఇప్పుడెందుకనో..!? తెలియదు కానీ.. నిర్మల్ మున్సిపాలిటీ చరిత్రను సజీవ సమాధి చేస్తోంది. సాక్షాత్తు బల్దియానే తన కార్యాలయం వెనుకనే ఉండే ఏనుగుల (శరద్‌మహల్) బావిని పూడ్చేస్తోంది. డంప్‌యార్డులో పోయాల్సిన చెత్తను తీసుకొచ్చి చారిత్రక బావిని ఆనవాళ్లు లేకుండా చేసేస్తోంది. ఇదొక్కటేకాదు.. నిర్మల్ చుట్టూ ఉన్న కందకమూ కనుమరుగవుతోంది. కాపాడాల్సిన వాళ్లే ఇలా కప్పేస్తుంటే.. మున్సిపల్ తీరుపై జిల్లావాసులు విస్తుపోతున్నారు. ఇదంతా.. స్థానిక మంత్రికి తెలిసే చేస్తున్నారా..!? అన్నసందేహాలు వ్యక్తపరుస్తున్నారు.

రాష్ట్రమంతటా అలా..
'అరె.. మీ నిర్మల్ ఎంత బాగుంది బై..! ఇక్కడి బురుజులు, కోటలు భలే ఉన్నాయి. చారిత్రక నేపథ్యం ఉన్న రాయల్ నిర్మల్‌లో ఉన్న మీరు చాలా అదృష్టవంతులు బై..' అని బయటి ప్రాంతాల నుంచి నిర్మల్‌కు ఎవరొచ్చినా స్థానికులతో ఇదే మాట అంటారు. కానీ.. ఇక్కడి కథ వేరన్న సంగతి తెలిస్తే ముక్కున వేలేసుకుంటారు. ఓ దిక్కు రాష్ట్రమంతటా చారిత్రక కట్టడాలు, పురాతన బావులను ప్రత్యేకంగా కాపాడుకునే ప్రయత్నం ఓ యజ్ఞంలా జరుగుతోంది. స్వయంగా మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ ఎన్నో కట్టడాలు, బావుల రక్షణ, వాటి నవీకరణ కోసం ప్రత్యేకశ్రద్ధ చూపారు. కానీ.. నిర్మల్‌లో మాత్రం అదే మున్సిపాలిటీ కాపాడడం అటుంచి సజీవంగా ఉన్న చరిత్రకు సమాధి కడుతుందన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా 'రాయల్ నిర్మల్'గా చెప్పుకొనే పట్టణ చారిత్రక ఆనవాళ్లను కాపాడాలని జిల్లావాసులు కోరుతున్నారు.



ఆక్రమణకు గురవుతున్న గజ్‌గఢ్ చుట్టూ కందకం

పరిశీలిస్తాం
జిల్లాకేంద్రంలోని పురాతన బావులు, కందకాల రక్షణకు కృషిచేస్తాం. ఒకట్రెండు చోట్ల కబ్జాలకు గురవుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. వీటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.
– సీవీఎన్ రాజు, మున్సిపల్ కమిషనర్, నిర్మల్

కందకాలూ ఖతం..
నిమ్మనాయుడుతో మొదలై శ్రీనివాసరావుతో పట్టిష్ఠంగా, పటిష్టంగా రూపుదిద్దుకుంది నిమ్మల. చుట్టూ చెరువులు, వాటిని ఆనుకునే బురుజులు, వాటిని కలుపుతూ చైనావాల్‌ను తలపించే గోడలు, వాటి వెంట లోతైన కందకాలు.. ఇలా మినీఓరుగల్లు తరహాలో అంచెలంచెలుగా నిమ్మల రక్షణ వ్యవస్థను కలిగిఉండేది. పాలకులు, అధికారుల పట్టింపు కరువై అడ్డూఅదుపులేని కబ్జాలకు నెలవై నాటి నిమ్మల క్రమంగా కనుమరుగవుతోంది. ఇప్పటికే చైన్‌గేట్‌ను ఓ వైపు పడగొట్టారు. బంగల్‌చెరువువద్ద సీమోల్లం ఘన ద్వారాన్ని కూల్చేశారు. చాలా బురుజులు నామరూపాల్లేకుండా పోయాయి. ఊరుచుట్టూ కనీసం 30ఫీట్ల వెడల్పుతో ఉన్న కందకాన్ని చిన్న డ్రైనేజీగా మార్చేశారు. చాలాచోట్ల ఆ డ్రైనేజీకీ చాన్స్ ఇవ్వకుండా కబ్జా చేసేశారు. తాజాగా ప్రియదర్శినినగర్‌లో జిల్లా ఆస్పత్రిని ఆనుకుని ఉండే గజ్‌గఢ్ చుట్టూ ఉన్న కందకాన్ని ఖతం చేసేపనిలో ఉన్నారు. ఒకప్పుడు ఏనుగులశాలగా ఉన్న ఈ గఢ్ ఆనవాళ్లు కోల్పోతోంది. ఇప్పటికే ఎస్‌ఆర్ డీజీ స్కూల్ వెనుక కందకాన్ని మొరంతో నింపేస్తున్నారు.

బాసరలో భక్తుల రద్దీ



అక్షరాభ్యాస మండపంలో భక్తులు

భైంసా: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు ముందుగా గోదావరినదిలో పుణ్యస్నానాలాచరించారు. సూర్యేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. అక్షరశ్రీకార మండపంలో చిన్నారులతో అక్షరాభ్యాస పూజలు చేయించారు.

గజ్జలమ్మ దేవికి పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: కుంటాలలోని గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మీ ఆలయాల్లో ఆదివారం భక్తులు సందడి నెలకొంది. మహారాష్ట్రలోని ముంబై, నాందెడ్, ధర్మాబాద్, భోకర్, శివుని ప్రాంతాల నుంచి భక్తులు వచ్చారు. తలనీలాలు సమర్పించారు. తులాభారం వేయించారు. నైవేద్యాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ, పల్లకీసేవ నిర్వహించారు. కుంటాలకు చెందిన కొండన్నగారి లింగారావు ఆలయాభివృద్ధి కోసం రూ.5వేలను కమిటీ సభ్యులకు అందజేశారు. కమిటీ సభ్యులు జుట్టు సుధాకర్, ఎల్లమల శంకర్, తాటి శివ, కడార్ల హరిప్రసాద్, బాలాయి గజ్జారాం తదితరులున్నారు.

సినిమా ప్రదర్శన అడ్డగింత

భైంసాటౌన్: పట్టణంలోని కమల థియేటర్‌లో ఆదివారం సాయంత్రం 'ది కేరళ స్టోరీ' చిత్ర ప్రదర్శనను పోలీసులు అడ్డుకున్నారు. భైంసా పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా చిత్ర ప్రదర్శన నిలిపేయాలని సూచించినట్లు పోలీసులు పేర్కొన్నారు. కాగా, శుక్రవారం చిత్రాన్ని ప్రదర్శించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఆదివారం థియేటర్ యాజమాన్యం మరోసారి ప్రదర్శించేందుకు సిద్ధం కాగా, ప్రేక్షకులు వచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని సినిమా ప్రదర్శనను అడ్డుకున్నారు.

యూడైస్ ప్లస్.. మొక్కు'బడి'గా!

- ఆన్‌లైన్ నమోదులో ఉదాసీనత
- వివరాల నమోదుపై అలసత్వం
- నేటితో ముగియనున్న గడువు

మంచిర్యాలఅర్బన్: సాంకేతిక రంగంలో మార్పులకు అనుగుణంగా ముందుకు సాగాల్సిన పాఠశాలల యాజమాన్యాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. సమాచార పారదర్శకత, అన్ని రాష్ట్రాల విద్యార్థుల వివరాలు ఒకే పోర్టల్‌లో ఉండాలని కేంద్రం యూడైస్ ప్లస్(వెరిఫికేషన్) పేరుతో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ చేపట్టింది. ప్రతీ పాఠశాలలోని విద్యార్థి వివరాలు ఇందులో నమోదు చేయాల్సి ఉంది. ఆన్‌లైన్ నమోదు లేకపోతే ఆ విద్యార్థులకు సంబంధించి స్కాలర్‌షిప్, సర్టిఫికెట్ జారీ, ఇతర సందర్భాల్లో ఇబ్బందులు తలెత్తనున్నాయి. ఈ సెంట్రల్ పోర్టల్‌ను 30 నిమిషాల్లో 100 మంది విద్యార్థుల వివరాలు నమోదు చేసి అప్రూవ్ చేసేలా డిజైన్ చేశారు. 2022–23కు సంబంధించి విద్యార్థుల వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఫిబ్రవరిలో ప్రారంభించారు. ఈనెల 15న (సోమవారం) గడువు ముగియనుంది. అయితే ఉమ్మడి జిల్లాలోని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల నుంచి స్పందన పెద్దగా లేదు. విద్యాశాఖలో ఎన్ని యాప్‌లు వచ్చినా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ అంతంతమాత్రంగానే నమోదు చేస్తున్నారనే విమర్శలున్నాయి.

విద్యార్థుల పూర్తి సమాచారం..
విద్యార్థుల పూర్తి సమాచారం తెలిపేలా ఇందులో డాటా ఎంట్రీ చేస్తారు. పాఠశాల పేరు, మండలం, విద్యార్థి పూర్తిపేరు, తల్లిదండ్రులు, కులం, మాట్లాడే భాష, పుట్టిన ఊరు, ప్రస్తుత నివాసం, పుట్టిన తేదీ, పూర్వ పాఠశాల, ఏ సంవత్సరం ఎక్కడ చదువుకుంది, మీడియం, బ్లడ్‌గ్రూప్, ఎత్తు, బరువు, పాఠశాల నుంచి ఇంటికి ఎంత దూరం, విద్యార్థి బ్యాంకు ఖాతాల వివరాలు పొందుపరుస్తారు.

సాంకేతిక కారణాలతో..
ఉమ్మడి జిల్లాలోని ఆయా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పోర్టల్‌లో వివరాల నమోదుకు సాంకేతిక కారణాలు సాకుగా చూపుతున్నాయి. ప్రస్తుతం సెలవులను సాకుగా చూపి నమోదు గడువు ముగుస్తున్నా స్పందించడం లేదని తెలుస్తోంది. కొంతమంది గడువు పెంచకపోతారా? అని కావాలనే జాప్యం చేస్తున్నట్లు సమాచారం. ఇక కళాశాలల యాజమాన్యాలు అది తమ పని కాదని తప్పించుకుంటున్నాయి. అయితే యూడైస్ నంబర్ ఆధారంగానే స్కాలర్‌షిప్ మంజూరయ్యే వీలుంటుంది.

గతంలో స్టూడెంట్ ఇన్ఫోలో..
ఇంతకుముందు స్టూడెంట్ ఇన్ఫోలో విద్యార్థుల వివరాలు ఉండేవి. ఇది రాష్ట్రస్థాయిలో ఉండేది. ప్రస్తుతం సెంట్రల్ పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా విద్యార్థి ఎక్కడ చదివేది ఇట్టే తెలిసిపోనుంది. తద్వారా సర్టిఫికెట్ల జారీ కూడా సులువుకానుంది. ఒక్క మంచిర్యాల జిల్లాలోనే 2022–23 ప్రకారం 1,079 పాఠశాలలకు చెందిన 1,28,712 మంది విద్యార్థులు యూడైస్ ప్లస్‌లో నమోదు చేయాలి. ఈనెల 14వ తేదీ వరకు 49,500 మంది విద్యార్థుల వివరాలు మాత్రమే నమోదు చేశారు. మూడు నెలల్లో 39 శాతం పూర్తి కాగా మిగతా 61 శాతం నమోదుకు ఎన్ని రోజులు తీసుకుంటారన్న ప్రశ్న తలెత్తుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఈనెల 14వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు ఉమ్మడి జిల్లాలో వివరాల నమోదు ఇలా..

జిల్లా	విద్యార్థులు	నాన్‌స్టార్టడ్	కంప్లీట్ చేసినవి	శాతం
ఆదిలాబాద్	1,52,739	1,31,578	20,960	13.72
కుమురంభీం	1,04,472	80,922	23,374	22.37
మంచిర్యాల	1,28,712	82,496	45,253	35.16
నిర్మల్	1,42,208	48,272	93,832	65.98

పాఠశాలల వారీగా వివరాలు..

జిల్లా	స్కూళ్లసంఖ్య	నాన్‌స్టార్టడ్	ఇన్‌ప్రోగ్రెస్	కంప్లీటెడ్
ఆదిలాబాద్	1,447	1,090	154	233
కుమురంభీం	1,271	871	19	209
మంచిర్యాల	1,079	526	161	392
నిర్మల్	1,081	226	157	698

నేటి నుంచి క్రీడోత్సవం

- 34 అంశాల్లో సీఎం కప్ పోటీలు
- ఆసక్తి చూపుతున్న క్రీడాకారులు
- మూడు స్థాయిల్లో క్రీడలు
- రాష్ట్రస్థాయిలో గెలుపొందినవారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు




మామడ: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు.. వారిలోని నైపుణ్యం, ప్రతిభను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నేటి నుంచి సీఎం కప్ క్రీడాపోటీలు నిర్వహిస్తోంది. వేసవి సెలవులు కావడంతో యువకులు, విద్యార్థులు పాల్గొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఆటలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వ్యక్తిగత, జట్టు విభాగాల జేతలకు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాలు ఇవ్వనున్నారు.

34 అంశాల్లో పోటీలు
సీఎం కప్ క్రీడా పోటీలు 34 అంశాల్లో నిర్వహించనున్నారు. 15–36 ఏళ్లు కలిగిన క్రీడాకారులు అర్హులు. మండల స్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపీపీ చైర్మన్‌గా, ఎంపీడీవో కన్వీనర్‌గా, జెడ్పీటీసీ, తహసీల్దార్, ఎంఈవో, మండల వైద్యాధికారి, మండల పంచాయతీ అధికారి, సబ్‌ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, వ్యాయామ ఉపాధ్యాయుడు సభ్యులుగా వ్యవహరిస్తారు. మండల స్థాయిలో ఈ నెల 15నుంచి 17వ తేదీ వరకు క్రీడలు నిర్వహిస్తారు. పోటీల నిర్వహణకు రూ.15వేలు నిర్వాహకులకు అందిస్తారు. ఇందులో ఐదు అంశాల్లో క్రీడాకారులు పోటీ పడతారు. గ్రామపంచాయతీ నుంచి వచ్చిన క్రీడాకారులు మండల స్థాయిలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, ఖోఖో, వాలీబాల్ అంశాల్లో పోటీ పడతారు. ఇందులో గెలుపొందిన జట్లను జిల్లా స్థాయికి పంపుతారు. జిల్లా స్థాయి పోటీలు ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో చైర్మన్‌గా కలెక్టర్, వైస్‌చైర్మన్‌గా ఎస్పీ, కోవైస్ చైర్మన్‌గా అడిషనల్ కలెక్టర్, కన్వీనర్‌గా డీవైఎస్వో, సభ్యులుగా ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు, డీఈవో, మున్సిపల్ కమిషనర్, జీఎం ఇండస్ట్రీస్ సభ్యులుగా ఉంటారు. ఈ క్రీడల నిర్వహణకు రూ.75వేలు ప్రభుత్వం అందించనుంది. 11 అంశాల్లో క్రీడాకారులు పోటీ పడతారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్, రెజ్లింగ్ అంశాల్లో పోటీలు నిర్వహిస్తారు. ఈ నెల 28నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రస్థాయిలో 18 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన క్రీడాంశాలతోపాటు ఆర్చరీ, జిమ్నాస్టిక్స్, హాకీ, లాన్‌టెన్నిస్, షూటింగ్, టేబుల్‌టెన్నిస్, వెయిట్‌లిఫ్టింగ్ అంశాల్లో పోటీలు నిర్వహిస్తారు.

రాష్ట్రస్థాయి విజేతలకు బహుమతులు
రాష్ట్రస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు ప్రైజ్‌మనీ, ప్రశంసాపత్రాలు అందిస్తారు. వ్యక్తిగత క్రీడాంశాల్లో గెలుపొందిన క్రీడాకారులకు ప్రథమ బహుమతిగా గోల్డ్‌మెడల్.. రూ.20వేల నగదు, ద్వితీయ బహుమతిగా సిల్వర్ మెడల్.. రూ.15వేల నగదు, తృతీయ బహుమతిగా బ్రాంజ్‌మెడల్.. రూ.10వేల నగదు అందించనున్నారు. జట్టు విభాగంలో విజేతగా నిలిచిన జట్లకు ప్రథమ బహుమతిగా గోల్డ్‌మెడల్.. రూ.లక్ష నగదు, ద్వితీయ బహుమతిగా సిల్వర్‌మెడల్.. రూ.75వేల నగదు, మూడో స్థానం పొందిన జట్టుకు బ్రాంజ్‌మెడల్.. రూ.50వేల నగదు ప్రోత్సాహకం అందించనున్నారు.

దాతలు దయతలిస్తేనే..
మండల స్థాయిలో సీఎం కప్ క్రీడల నిర్వహణకు ప్రభుత్వం రూ.15వేలు అందిస్తోంది. ఈ నిధులతో క్రీడలు నిర్వహించడం సాధ్యం కాదు. క్రీడాకారులకు డ్రెస్ మెటీరియల్, స్పోర్ట్స్ మెటీరియల్, క్రీడల్లో పాల్గొనేందుకు వచ్చిన వారికి పళ్లు, స్నాక్స్, భోజనం అందించాల్సి ఉంటుంది. క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేయాల్సి ఉంది. క్రీడలపై ఆసక్తి ఉన్నవారు, స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రజాప్రతినిధులను సంప్రదించి సహకారాన్ని తీసుకోవడం, క్రీడా సంబురాల్లో ఎక్కువమంది పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఉదాహరణకు మామడ మండల కేంద్రంలో మూడురోజుల పాటు నిర్వహించే పోటీల్లో మండలంలోని 27 గ్రామపంచాయతీల నుంచి వాలీబాల్ అంశంలో 14 జట్లు, కబడ్డీలో 10 జట్లు, ఖోఖోలో ఐదు జట్లు, అథ్లెటిక్స్‌లో 50 మందితో కలిపి దాదాపు 250 నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొంటారని అధికారులు భావిస్తున్నారు.

క్రీడాకారులకు మంచి అవకాశం



ఆటలపై ఆసక్తి కలిగిన క్రీడాకారులకు సీఎం కప్ క్రీడల్లో పాల్గొనే మంచి అవకాశం లభించింది. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు ఉంటాయి. రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. ప్రశంసాపత్రం, నగదు బహుమతి అందిస్తారు. సీఎం కప్ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు అవగాహన కల్పించి వ్యాయామ ఉపాధ్యాయులు పోటీలు నిర్వహిస్తారు.
– రమణారావ్, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి

అ'పూర్వ' సమ్మేళనం



తోటి పూర్వ విద్యార్థులతో ఐడీసీ చైర్మన్ వేణుగోపాలాచారి



ఖానాపూర్: పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో విద్యార్థులు



కుంటాల: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

నిర్మల్‌ఖిల్లా: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1972–74లో ఇంటర్ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 51ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత పాఠశాలలో కలుసుకుని అప్పటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. అకాల మరణం పొందిన దోస్తులను గుర్తు చేసుకున్నారు. వారి కుటుంబాల యోగ క్షేమాలు తెలుసుకున్నారు. సమ్మేళనంలో పాల్గొనడానికి ఢిల్లీ, గుర్‌గావ్, పుణే, ఔరంగాబాద్ తదితర ప్రాంతాల నుంచి ఆనాడు చదువుకున్న చిన్ననాటి మిత్రులు తరలివచ్చారు. అప్పుడు చదువుకున్న ఎందరో మిత్రులు ప్రస్తుతం అనేక ఉన్నతస్థాయిల్లో స్థిరపడడం ఆనందదాయకమని పాల్గొన్న మిత్రులు పేర్కొన్నారు. కాగా, పూర్వ విద్యార్థి, ఐడీసీ చైర్మన్ వేణుగోపాలాచారి మాట్లాడుతూ.. చిన్ననాటి మిత్రులను కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. 50 ఏళ్ల క్రితం నిర్మల్‌లోని సోమార్‌పేట్ లోగల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకున్నామని చెప్పారు. నా చిన్ననాటి మిత్రులను కలుసుకోవడం చాలా ఆనందగా ఉందని తెలిపారు. ఆనాటి మధురస్మృతులను గుర్తు చేసుకున్నామని, ఏ స్థాయిలో ఉన్నా చిన్నప్పటి స్నేహం మరువలేని అనుభూతులు కలిగిస్తోందని చెప్పారు. అప్పటిరోజుల్లో చేసిన అల్లరి, కలిసి ఆడిన ఆటలు గుర్తుకు వచ్చి బాల్యంలోకి వెళ్లినట్లయిందన్నారు. పూర్వ విద్యార్థి, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న మాట్లాడారు. చిన్నప్పుడు కలిసి చదువుకున్నవారి జ్ఞాపకాలు మరువలేనివని తెలిపారు. మిత్రుల యోగక్షేమాలు తెలుసుకున్నామని చెప్పారు. అప్పటి మిత్రులను కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. కష్టసుఖాలు, అప్పటి అనుబంధాలను నెమరువేసుకున్నాం. పేదరికంలో ఉన్న చిన్ననాటి మిత్రులకు తోడ్పాటునందించాలని తీర్మానించుకున్నాం.

ఖానాపూర్‌లో..
ఖానాపూర్: పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్‌హాల్‌లో పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1989–90 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన 200 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. పాఠశాలలో చదివిన జ్ఞాపకాలు, మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులు దేవన్న, విఠల్, నారాయణరావు, పెద్ద భూమన్న, పద్మ, పాలెపు సుదర్శన్‌ను ఆహ్వానించి సన్మానించారు.

కుంటాలలో..
కుంటాల: స్థానిక సృజన విద్యానిలయంలో 2005–2006లో ఏడో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. పూర్వవిద్యార్థులు పాఠశాలలో చదివిన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రోజంతా విద్యార్థులు, ఉపాధ్యాయులు సరదాగా గడిపారు. ప్రధానోపాధ్యాయుడు గంగన్న, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డైట్ లెక్చరర్‌కు డాక్టరేట్



కిరణ్ కుమార్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న కోలా కిరణ్ కుమార్‌కు డాక్టరేట్ లభించింది. సత్యసాయి యూని వర్సిటీ ఎడ్యుకేషన్ విభాగంలో పార్ట్‌టైమ్ పరిశోధన చేశారు. ప్రొఫెసర్ సంతోష్ జగ్వాబి పర్యవేక్షణలో 'ఎఫెక్టివ్ ప్రాక్టికల్ అప్రోచెస్ ఫర్ చైల్డ్‌హుడ్' అంశంపై పరిశోధన సమర్పించారు. దీంతో విద్యా విభాగంలో పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు సత్యసాయి వర్సిటీ డిప్యూటీ రిజిస్ట్రార్ పుష్పేంద్ర శర్మ తెలిపారు. ఈయనకు డాక్టరేట్ లభించడంపై కళాశాల లెక్చరర్లు, ఛాత్రోపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



చంద్రకళ మృతదేహం

తానూరు(ముధోల్): మండలంలోని బామ్ని ఎక్స్‌రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. మహారాష్ట్రలోని ధర్మాబాద్ తాలూకా కర్కెల్లి గ్రామానికి చెందిన బత్తుల్‌వార్ చంద్రకళ (40), ఆమె కుమారుడు సాయిబు, కుమార్తె సాయిబాయి, మనుమడు (18నెలలు) ఆదివారం ద్విచక్ర వాహనంపై కుభీర్ మండలంలోని సాొ్లి గ్రామానికి వెళ్లారు. తిరుగుప్రయాణంలో బామ్ని ఎక్స్‌రోడ్డు వద్ద గుంతలోకి దిగిన బైక్ కుదిపేయడంతో బాలుడు జారి కిందపడిపోయాడు. వెంటనే తల్లి సాయిబాయి, అమ్మమ్మ చంద్రకళ వాహనం పైనుంచి కిందకు దూకారు. చంద్రకళ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్సై విక్రమ్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. అధికారులు స్పందించి రహదారులపై గుంతలవు పూడ్చివేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చెరువులో దూకి వృద్ధుడు ఆత్మహత్య



షేక్‌చాంద్‌పాషా(ఫైల్)

కుంటాల(ముధోల్): చెరువులో దూకి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఓలాలో చోటు చేసుకుంది. ఎస్సై హన్మాండ్లు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన షేక్‌చాంద్‌పాషా(60) భార్య ఆరునెలల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి మనోవేదనకు గురయ్యాడు. ఆదివారం ఉదయం ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఓలా శివారులోని గోవింద్‌రావు చెరువులో మృతదేహాన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతునికి ఐదుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య



సాయిలు(ఫైల్)

లోకేశ్వరం(ముధోల్): పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కన్కపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దూదిగాం సాయిలు(40) కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా వ్యాధి నయం కాలేదు. శనివారం సాయంత్రం ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆటోలో భైంసాలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య సుజాత, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పల్లెటూరు.. అమ్మతీరు



ఎడ్లబండిపై చిన్నారి

- వేసవి సెలవుల్లో పల్లెబాట పట్టిన పిల్లలు
- పొలం గట్లు, ఊర చెరువులు, తోటల వద్ద సందడి
- మూగజీవాలు, ఎడ్లబండ్లతో చిన్నారుల ఆటపాటలు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఊరూ పల్లెటూరు.. దీనితీరే అమ్మతీరు.. అంటూ ఇటీవల వచ్చిన సినిమా పాటను తలపించినట్లుగా పట్నం నుంచి వచ్చిన చిన్నారులు పల్లెల్లో వేసవి సెలవులను ఆస్వాదిస్తున్నారు. గత నెలలో పరీక్షలు ముగిశాయి. ఏప్రిల్ 23 నుంచి పాఠశాలలకు వేసవి సెలవులొచ్చాయి. ఇంకేం.. పట్టణ ప్రాంతాల నుంచి గ్రామాల్లోని అమ్మమ్మ, నానామ్మ..తాతయ్యల ఊళ్ల బాట పట్టారు. పుస్తకాలు, పెన్నులు, హోంవర్క్, స్కూల్ బ్యాగులను పక్కన పడేసిన చిన్నారులు చెరువులు, కాల్వ గట్లు, మామిడితోటలు, పంట పొలాలు, ఎడ్లబండ్లతో ఆటపాటలు సాగిస్తున్నారు.

పల్లెల్లో పిల్లల సందడి..

గ్రామాల్లో చెట్టు నీడన పిల్ల సందడి నెలకొంటుంది. పట్టణం ఉంటున్న ఎత్తైన భవనాలు, భారీ రంగురంగుల ఖరీదైన కార్లు, ఇతర భారీ వాహనాల చప్పుళ్ల మోతా, పొల్యూషన్ నుంచి ఒక్కసారిగా పల్లెలోని పూరిగుడిసెలు, పెంకుటిల్లులు, ఎడ్లబండ్లు, పక్షుల చప్పుడు, ఆహ్లాదకరమైన పలకరింపులుతో కొంత అనుభూతిని పొందుతున్నారు. ఆవులు, గేదెలు, మేకలు, తదితర మూగజీవాలు, చెరువులు, కుంటలు, వాగులు, కాల్వల్లో లభించే చేపపిల్లలతో మురిసిపోతున్నారు. స్నేహితులుగా మారి ఇక్కడి ఆటపాటలతో ప్రేమగా కలిసిపోతున్నారు.



అమ్మమ్మతో చిన్నారులు



చెట్టుపైకి ఎక్కి ఆడుతున్న చిన్నారులు



చెరువు గట్టు వద్ద హైదరాబాద్ నుంచి నెన్నెల గ్రామానికి వచ్చిన చిన్నారులు, కుటుంబ సభ్యులు



రొయ్యతో చిన్నారి



నంనూర్‌లో గోలీలు ఆడుతున్న చిన్నారులు

సెలవుల్లో అమ్మమ్మ ఊరికి..



సెలవులు రావడంతో హైదరాబాద్ నుంచి అమ్మమ్మ ఊరికి వచ్చినం. ఇక్కడ బామ్మ ఒక్కతే ఉంటుంది. మేము రావడంతో ఎంతో సంతోషం వ్యక్తం చేసింది. రోజంతా ఇంటి వద్ద పేరట్లో ఆడుకోవడం, మామిడి తోటల్లో కోతికొమ్మ ఆడుకోవడం, ప్రాజెక్టు వాటర్ చూశాం ఎంత బాగనిపిస్తుంది. – మురుకూరి లక్ష్మిసహస్ర

హాలీడేస్ ఫుల్ ఎంజాయ్..



మేము హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఉంటున్నాం. అక్కడే నేను చదువుకుంటున్న.. మా మమ్మి, డాడి అక్కడే జాబ్ చేస్తున్నారు. ఎగ్జామ్స్ అయిపోయాయి. డాడీ వాళ్ల స్వంత ఊరు నెన్నెల (నానమ్మ ఊరు)కు చెల్లి నేను వచ్చాం. ఇక్కడ ఎడ్లబండ్లు, చెరువులు, పొలంగట్లు చెట్ల నీడన ఫ్రెండ్స్‌తో కలిసి ఆడుకుంటున్నాం. – కొండ జనని కృతి, హైదరాబాద్

గ్రామాల్లో నాటి ఆటలు..

గోలీల ఆట ఓవైపు.. పులి–మేక మరోవైపు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నాటి ఆటలు ఆరోగ్యంతో పాటు అనుబంధాన్ని పెంచేవి. ఇప్పుడైతే అంతా సెల్‌లతో ఆటలు ఆడుతూ అనారోగ్యాలను కొనితెచ్చుకుంటున్న సందర్భాలు.. గతంలో మైదానాల్లో క్రికెట్, చిర్రగోనె, గోలీలు ఇలా ఎన్నో ఆటలు ఆడేవారు. కనుమరుగైన ఆలనాటి ఆటలు ఇప్పుడు మళ్లీ గ్రామాల్లో కనిపిస్తున్నాయి. హాజీపూర్ మండలం రాపల్లి గ్రామంలోని ఓ వీధిలో వాడ పెద్దలు కలిసి ఇలా కల్వర్టు సైడ్ వాల్‌పై ఇలా కూర్చుని పులి–మేక ఆట ఆడుతూ సరదాగా గడుపుతున్నారు. నంనూర్ గ్రామంలో చిన్నారులు సరదాగా గోలీల ఆట ఆడుతూ కనిపించారు.

పిల్లలను వదిలి యాడికెళ్లివి కొడుకా..

- ఇటీవలే కిడ్నీలు ఫెయిల్
- చికిత్స పొందుతూ మృతి



ప్రభాకర్(ఫైల్)



రోదిస్తున్న తల్లిదండ్రులు

వేమనపల్లి(బెల్లంపల్లి): ట్రాక్టర్ బండి అచ్చింది.. బాపు అత్తలేడని మీ ఇద్దరు పిల్లలు అడుగుతాండ్రు.. పిల్లలను వదిలి నీవు యాడికెళ్లివి కొడుకా.. అంటూ ఆ తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. మండల కేంద్రానికి చెందిన తెల్ల వెంకటి, ఎర్రక్క దంపతుల కుమారుడు ప్రభాకర్ (26) ఎనిమిదేళ్లుగా ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య రజిత, ఇద్దరు పిల్లలున్నారు. ఇటీవలే కిడ్నీలు ఫెయిల్ కావడంతో ప్రభాకర్ అనారోగ్యానికి గురయ్యాడు. మంచిర్యాల ఆస్పత్రిలో చికిత్స చేయించినా నయంకాలేదు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. లోకం తెలియని కుమారుడు అక్షయ్, చంటి పాప ఆరాధ్య తండ్రి మృతి చెందాడన్న విషయం తెలియక బాపు ఏడని అడుగుతుంటే పలువురు కన్నీటిపర్యంతమయ్యారు.

ప్రమాదవశాత్తు మొక్కజొన్న పంట దగ్ధం



దగ్ధమైన మొక్కజొన్న పంట

సారంగాపూర్(నిర్మల్): ప్రమాదవశాత్తూ మొక్కజొన్న పంట దగ్ధమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని జామ్ గ్రామానికి చెందిన రాజారపు భోజన్న తనకున్న నాలుగెకరాల్లో మొక్కజొన్న పంటను కోసి నూర్పిడికి సిద్ధంగా ఉంచాడు. ఆదివారం ప్రమాదవశాత్తూ పంటకు నిప్పంటుకోవడంతో పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదంలో సుమారు 2.40 లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధితుడు వాపోతున్నాడు. ఇదే తరహాలో రాంసింగ్ తండాకు చెందిన మాన్షి అనే రైతుకు చెందిన ఎకరం నర మొక్కజొన్న పంట కోత కోసి నూర్పిడికి సిద్ధంగా ఉంచాడు. ప్రమాదవశాత్తూ పంటకు నిప్పంటుకోవడంతో దగ్ధమైంది. సుమారు 1.80 లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధితుడు వాపోతున్నాడు. అగ్నిమాపక యంత్రానికి సమాచారం ఇచ్చినా సకాలంలో రాకపోవడంతో పంట పూర్తిగా దగ్ధమైందని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో మేక మృతి



మృతి చెందిన మేక

నెన్నెల(బెల్లంపల్లి): మండలంలోని నార్వాయిపేటలో విద్యుదాఘాతంతో మేక మృతి చెందింది. గ్రామానికి చెందిన లావుడియ హరీశ్ సింగ్‌నాయక్‌కు చెందిన మేక ఆది వారం మేతకోసం గ్రామ సమీపంలోని పంటచేల వైపు వెళ్లింది. పంటపొలంలో ట్రాన్స్‌ఫార్మర్ కిందికి ఉండడంతో అటుగా వెళ్లిన మేక ఎర్త్‌వైరుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మేక విలువ రూ.10 వేలు ఉంటుందని, ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



రమేశ్(ఫైల్)

జన్నారం(ఖానాపూర్): ఈ నెల 9న మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రేండ్లగూడ గ్రామానికి చెందిన అల్లం రమేశ్ (32) ఈ నెల 9న గ్రామ శివారులో అతిగా మద్యం సేవించాడు. అదే మత్తులో పురుగుల మందుతాగి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులకు తెలుపడంతో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నిషేధం ఉన్నా ఆగని దందా

- ఏడేళ్లుగా జిల్లాలో బీజీ–3 సాగు
- గుట్టుచప్పుడు కాకుండా గ్రామాల్లో సరఫరా
- హరించనున్న జీవవైవిధ్యం



దహెగాంలో పట్టుబడిన నకిలీ విత్తనాలు (ఫైల్)

ఇచ్చోడ/పెంచికల్‌పేట్: ప్రభుత్వం బీజీ–3 పత్తి విత్తనాలను నిషేధించి ఏడేళ్లు కావస్తున్నా ఏటా ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో నకిలీ విత్తనాల దందా జోరుగా కొనసాగుతూనే ఉంది. కొంతమంది వ్యాపారులు ప్రతీ సంవత్సరం మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో గుట్టుచప్పుడు కాకుండా విత్తనాలను గ్రామాల్లోకి చేరవేసి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. తూర్పు జిల్లాతో పాటుగా ఇతర రాష్ట్రాల నుంచి రైలుమార్గం ద్వారా విత్తనాలను దిగుమతి చేసుకుని దందా కొనసాగిస్తున్నారు.

గుట్టుచప్పుడు కాకుండా దందా

కొంతమంది వ్యాపారులు తమ ఏజెంట్ల ద్వారా నిషేధిత బీజీ–3 పత్తి విత్తనాలను గుట్టుచప్పుడు కాకుండా గ్రామాల్లోకి చేరవేస్తున్నట్లు తెలుస్తోంది. నకిలీ విత్తనాల దందాను చేసే వ్యాపారులు జిల్లా వ్యాప్తంగా మారుమూల గ్రామాల్లో విత్తనాలను డంప్ చేసుకుని అక్కడి నుంచి ముందుస్తు ప్రణాళిక ద్వారా అక్కడి నుంచి అమాయక రైతులకు అంటగడుతున్నారు.

ఏజెన్సీ మండలాల్లోనే అధికం...

నిషేధిత బీజీ–3 పత్తి విత్తనాలను అత్యధికంగా ఏజెన్సీ మండలాల్లోని రైతులకు అంటగడుతున్నట్లు సమాచారం. ఏడేళ్లుగా దందా ఈ పద్ధతిలోనే కొనసాగుతోంది. వ్యవసాయ అధికారులు కేవలం విత్తనాల దుకాణల్లో తనిఖీలు నిర్వహిస్తుండడంతో నకిలీ విత్తనాల దందా యథావిధిగా కొనసాగుతున్నట్లు సమాచారం.

హరించనున్న జీవవైవిధ్యం..

నిషేధిత బీజీ–3 పత్తి విత్తనాల సాగు చేసిన రైతులు, గడ్డి నివారణ కోసం నిషేధిత గ్లైఫోసెట్ వాడుతారు. ఇది అతిగా వాడడం వల్ల పిచికారీ చేసిన వ్యక్తులు క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంది. అంతేకాకుండా రాబోయే రోజుల్లో సారవంతమైన నల్లరేగడి నేలలు కలుషితం అవుతాయని, జీవవైవిధ్యానికి తీవ్రనష్టం కలుగుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

లక్ష ఎకరాల్లో బీజీ–3 సాగు

జీవవైవిధ్యానికి భంగం కలుగుతుందన్న శాస్త్రవేత్తల హెచ్చరికతో ఏడేళ్ల కిందట రాష్ట్ర ప్రభుత్వం బీజీ–3ని నిషేధించింది. కానీ జిల్లాలో ఎక్కువ మంది రైతులు గుట్టుచప్పుడు కాకుండా బీజీ–3 విత్తనాలు సాగు చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ఏటా 3 లక్షల ఎకరాలకు పైగా పత్తి సాగవుతుండగా లక్ష ఎకరాల్లో నిషేధిత బీజీ–3 సాగుచేస్తున్నట్లు తెలుస్తోంది. కుమురంభీం జిల్లాలోని 3,20,000 ఎకరాల్లో రైతులు ఏటా పత్తి సాగు చేస్తుండగా ఆసిఫాబాద్, రెబ్బెన, దహెగాం, పెంచికల్‌పేట్, బెజ్జూర్, చింతలమానెపల్లి, సిర్పూర్(టి), కాగజ్‌నగర్, కౌటాల మండలాల్లో నకిలీ విత్తనాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో ఇటీవల పట్టుబడిన నకిలీ విత్తనాలు

- ఏప్రిల్ 30న మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలంలోని టేకులపల్లిలో రూ.15 లక్షల నకిలీ పత్తి విత్తనాలు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.
- ఈ నెల 5న కుమురంభీం జిల్లా దహెగాం మండలంలోని గొర్రెగుట్టలో రూ.లక్షా 40 వేల విలువైన 37 కిలోల విత్తనాలను స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు.
- ఈ నెల 12న ఆసిఫాబాద్ మండలంలోని బూరుగూడలో రూ.లక్షా 50వేల విలువైన 40 కిలోల విత్తనాలు స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేశారు.

బీజీ–3 సాగుచేయొద్దు

బీజీ–3 విత్తనాలపై ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ రకం పత్తి విత్తనాలను రైతులు సాగు చేయవద్దు. నకిలీ విత్తనాలను అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం. నిషేధిత విత్తనాల సమాచారం తెలిస్తే సమాచారం అందించాలి.

– పుల్లయ్య, డీఏవో, ఆదిలాబాద్

విత్తనశుద్ధితో అధిక దిగుబడులు

- పంటను ఆశించే చీడపీడల బెడద నివారించవచ్చు
- ఎరువుల వినియోగం చాలావరకు తగ్గుతుంది



జాడి బాపు, ఏడీఏ, చెన్నూర్



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్)

చెన్నూర్‌రూరల్: విత్తనశుద్ధితో అధిక దిగుబడులు సాధించవచ్చని చెన్నూర్ ఏడీఏ జాడి బాపు సూచిస్తున్నారు. శుద్ధి చేసిన విత్తనానికి వ్యాపించే తెగుళ్లను, మొలకదశలో ఆశించే చీడపీడలను సమర్థవంతంగా అరికట్టవచ్చని పేర్కొంటున్నారు. ఈ ఏడాది వానాకాలం సాగు సీజన్ సమీపిస్తున్నందువల్ల రైతులు ముందుగానే విత్తనశుద్ధి చేసుకుంటే మంచిదని సూచిస్తున్నారు.

విత్తనశుద్ధి ఇలా..

వరి: వరి విత్తనాన్ని శుద్ధి చేయాలంటే కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బెండిజమ్ కలిపి శుద్ధి చేసుకోవాలి. లేదా లీటరు నీటికి గ్రాము కార్బెండిజమ్ కలిపి ఆ ద్రావణంలో విత్తనాన్ని 24 గంటల పాటు నానబెట్టి తడి విత్తనశుద్ధి చేయాలి.

మొక్కజొన్న: ఒక కిలో మొక్కజొన్న విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్ లేదా థైరమ్ లేదా కోప్టాన్‌తో పొడి విత్తనశుద్ధి చేసుకోవాలి.

పల్లి: పల్లి విత్తనం శుద్ధికోసం 2ఎంఎల్ ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్ఎస్, 6 ఎంఎల్ నీటిలో కలిపి కిలో విత్తనానికి పట్టించాలి. ఒక గంట నీడలో ఆరబెట్టి 3గ్రాముల మాంకోజెబ్ లేదా గ్రాము టెబ్యుకొనజోల్ 2డీఎస్ పొడర్ పట్టించాలి.

పొద్దుతిరుగుడు: పొద్దు తిరుగుడు పంటను ఎక్కువగా ఆల్టనేరియా, ఆకుమచ్చ తెగులు ఆశిస్తుంది. దీని నివారణకు కిలో విత్తనానికి క్వింటాల్ అనే మందును (ఇప్రోడియోన్ 25శాతం, కార్బండిజమ్ 25 శాతం)2 గ్రాములు పట్టించాలి. లేదా కిలో విత్తనానికి 5 గ్రాముల ఇమిడాక్లోపిడ్‌తో శుద్ధి చేయాలి.

పత్తి: బీటీ రకం పత్తి విత్తనాన్ని ప్యాక్ చేసే సమయంలోనే ఇమిడాక్లోపిడ్ అనే మందుతో విత్తనశుద్ధి చేస్తారు. కాబట్టి అదనంగా విత్తనశుద్ధి చేసే అవసరం లేదు.

జొన్న: కిలో జొన్న విత్తనానికి థయోమిథాక్సమ్ 3 గ్రాములు, థైరమ్ 3 గ్రాములు కలిపి శుద్ధి చేయాలి.

పప్పు–అపరాల సాగు: ఏదేని పప్పు కిలో విత్తనానికి 3 గ్రాముల థైరామ్ లేదా 3 గ్రాముల కాప్టాన్ లేదా 3 గ్రాముల మాంకోజెబ్ మందుతో విత్తనశుద్ధి చేసుకోవాలి. తర్వాత అరగంట సేపు నీడలో ఆరనివ్వాలి. ఆతర్వాత 5 గ్రాముల థయోమిథాక్సమ్ లేదా 5ఎంఎల్ ఇమిడాక్లోపిడ్ మందుతో విత్తనశుద్ధి చేసి విత్తనాన్ని 4 నుంచి 5 గంటల పాటు నీడలో ఆరబెట్టాలి. ఇలా విత్తనశుద్ధి చేసుకుంటే పంటను చీడ పీడలు ఆశించవు. మందుల అవసరం కూడా ఎక్కువగా ఉండదు. పంట దిగుబడి కూడా అధికంగా వస్తుంది.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

అతి సులభంగా రుణాలు పొందండి. వ్యాపారం ప్రాపర్టీ మార్క్ షీట్ వ్యక్తిగత LIC వ్యవసాయ భూమిపై తక్కువ దస్తావేదులతో పొందండి. 9505973750, 8096532189. [T-69]

WANTED

డైరెక్ట్ హోటల్ జాబ్స్, ఫీజు లేదు, హైదరాబాద్‌లోని 5 స్టార్ హోటల్స్‌లో పనిచేయుటకు క్యాటరింగ్ బాయ్స్ కావలెను. జీ: 12-16K రూమ్+ఫుడ్ ఫ్రీ. ఇది కన్సల్టెన్సీ కాదు. Age: 18-30. Ph: 9618698546 [H-797533]

లేపాక్షి హెల్త్‌కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను ఫ్రీ వసతి+భోజనం. జీ: 18K ఏజెంట్ కమీషన్ 6K. ఫోన్: 9640400073. [HA-148]

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.